క్లుప్తంగా

'పది' పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధించాలి

ఎమ్మెల్యే జ్యోతుల చంటిబాబు



విద్యార్థులకు స్టడీ మెటీరియల్ అందజేస్తున్న ఎమ్మెల్యే జ్యోతుల చంటిబాబు

జగ్గంపేట: విద్యార్థులు ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకుని పదో తరగతి పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధించాలని ఎమ్మెల్యే జ్యోతుల చంటిబాబు అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో గురువారం పదో తరగతి విద్యార్థులకు ఆయన స్టడీ మెటీరియల్‌ను పంపిణీ చేశారు. మండలంలోని ప్రభుత్వ పాఠశాలలో పదో తరగతి చదువుతున్న 812 మంది విద్యార్థులకు స్టడీ మెటీరియల్ అందజేశారు. కార్యక్రమంలో ఎంపీపీ అత్తులూరి నాగబాబు, వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ జనపరెడ్డి బాబు, రాష్ట్ర వైఎస్సార్ సీపీ సేవాదళ్ కార్యదర్శి ఒమ్మి రఘురాం, ఎంపీడీఓ హరికృష్ణ పాల్గొన్నారు.

నేడు గండేపల్లిలో గడపగడపకూ..

గండేపల్లి: గ్రామంలో శుక్రవారం గడపగడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించనున్నట్టు ఎంపీపీ చలగళ్ల దొరబాబు గురువారం తెలిపారు. ఎమ్మెల్యే జ్యోతుల చంటిబాబు గ్రామంలో ఇంటింటికీ వెళ్లి ప్రజల సమస్యలు తెలుసుకుంటారని చెప్పారు. ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

ప్రభుత్వ స్థలాల పరిశీలన



ఏలేశ్వరంలో ప్రభుత్వ స్థలాలను పరిశీలిస్తున్న అధికారులు

ఏలేశ్వరం: నవరత్నాలు–పేదలందరికీ ఇళ్లు పథకంలో లబ్ధిదారులకు ఇళ్ల స్థలాలుగా కేటాయించేందుకు గాను పట్టణంలోని ప్రభుత్వ స్థలాలను గురువారం అధికారులు పరిశీలించారు. జగనన్న కాలనీల్లో సుమారు 2 వేల మందికి ఇళ్లస్థలాలు కేటాయించగా మిగిలిన లబ్ధిదారులకు ఇళ్లస్థలాలు కేటాయించవల్సి ఉంది. దీని నిమిత్తం తహసీల్దార్ విశ్వనాథశాస్త్రి ఆధ్వర్యంలో అధికారులు పట్టణంలోని పలు స్థలాలను పరిశీలించారు. నివేదికను ఉన్నతాధికారులకు అందజేస్తామని తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ కె.శ్రీనివాసరావు, వైఎస్సార్ సీపీ నాయకులు అలమండ చలమయ్య, యండగండి నాగబాబు, కడింశెట్టి వాసు పాల్గొన్నారు.

జగ్గంపేట ఎస్సైగా విద్యాసాగర్



జగ్గంపేట: స్థానిక ఎస్సైగా సీహెచ్ విద్యాసాగర్ గురువారం బాధ్యతలు చేపట్టారు. ఇప్పటివరకూ ఇక్కడ ఎస్సైగా పని చేసిన రఘునాథరావు కిర్లంపూడి పోలీసు స్టేషన్‌కు బదిలీ అయ్యారు. ఏలేశ్వరం ఎస్సైగా పనిచేస్తున్న విద్యాసాగర్ బదిలీపై ఇక్కడకు వచ్చారు. జగ్గంపేటలో ట్రాఫిక్ సమస్యపై ప్రత్యేక దృష్టి సారిస్తామని ఎస్సై విద్యాసాగర్ తెలిపారు.

ఘనంగా విగ్రహ పునఃప్రతిష్ఠ



కొత్తపేటలో విగ్రహ పునఃప్రతిష్ఠలో పాల్గొన్న ఎమ్మెల్యే చంటిబాబు

గండేపల్లి: స్థానిక కొత్తపేటలో నూతన నిర్మించిన లక్ష్మీగణపతి ఆలయంలో విగ్రహ పునఃప్రతిష్ఠ మహోత్సవం గురువారం వైభవంగా జరిగింది. దుర్గావఝ్జల సత్యనారాయణమూర్తి ఆధ్వర్యంలో పండితులు పరిమి బాబు, మంగతాయారు దంపతులతో ఈ విగ్రహ పునఃప్రతిష్ఠ చేయించారు. ఎమ్మెల్యే జ్యోతుల చంటిబాబు, ఎంపీపీ చలగళ్ల దొరబాబు, తోట రవి, ఏఎంసీ చైర్మన్ జనపరెడ్డి బాబు, ఎంపీటీసీ మద్దిపట్ల రామకృష్ణ, ఉప సర్పంచ్ జాస్తి వసంత్, కిర్లంపూడి సొసైటీ అధ్యక్షులు చదలవాడ బాబీ, సర్పంచ్ రుత్తుల లలిత, తోట రాంజీ, టీడీపీ ఉపాధ్యక్షులు జ్యోతుల నెహ్రూ ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. స్వామివారిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

పార్కు నిర్మాణానికి భూమిపూజ

ఏలేశ్వరం: పట్టణంలో పార్కు నిర్మాణానికి గురువారం భూమి పూజ చేశారు. స్థానిక షిర్డీ నగర్‌లోని గాంధీజీ విగ్రహం సమీపంలో పార్కు నిర్మాణానికి వైఎస్సార్ సీపీ మండల ఇన్‌చార్జ్, మున్సిపల్ కౌన్సిలర్ బదిరెడ్డి గోవిందు భూమి పూజ చేశారు. కార్యక్రమంలో గూడవిల్లి అర్జునరావు, తోట వెంకట్రావు, లోగిసు శేఖర్, అడపా దుర్గారావు, వుడతల రమణారావు, చెరకాని సత్తిబాబు తదితరులు పాల్గొన్నారు.



తుని మున్సిపల్ కార్యాలయంలో జాతీయ జెండాను ఆవిష్కరించిన కమిషనర్ ప్రసాదరాజు



కోటనందూరులో జాతీయ జెండాను ఎగురవేస్తున్న ఎంపీడీఓ సుబ్రహ్మణ్యశర్మ తదితరులు



కిర్లంపూడిలో జెండాను ఆవిష్కరించిన అధికారులు, ప్రజాప్రతినిధులు



గండేపల్లిలో జెండా వందనం చేస్తున్న అధికారులు, ప్రజాప్రతినిధులు



ఏలేశ్వరంలో జెండాకు సెల్యూట్ చేస్తున్న ప్రజాప్రతినిధులు, అధికారులు, విద్యార్థులు

మువ్వన్నెల రెపరెపలు

- ఘనంగా రిపబ్లిక్ డే వేడుకలు
- జాతీయ జెండాను ఆవిష్కరించిన అధికారులు, ప్రజాప్రతినిధులు
- సాంస్కృతిక కార్యక్రమాలతో అలరించిన విద్యార్థులు



జగ్గంపేటలో జెండా వందనంలో పాల్గొన్న ఎమ్మెల్యే జ్యోతుల చంటిబాబు



శంఖవరంలో ఉద్యోగులకు అవార్డులు అందిస్తున్న ఎమ్మెల్యే పర్వత ప్రసాద్



రౌతులపూడిలో జాతీయ పతాకాన్ని ఆవిష్కరిస్తున్న ప్రజాప్రతినిధులు

తుని: భారత గణతంత్ర దినోత్సవాన్ని తుని, ప్రత్తిపాడు, జగ్గంపేట నియోజకవర్గాల్లో గురువారం ఘనంగా నిర్వహించారు. ప్రభుత్వ కార్యాలయాలతో పాటు విద్యా సంస్థలు, వివిధ ప్రైవేటు సంస్థల్లో జాతీయ పతాకాన్ని ఎగురవేశారు. తుని పురపాలక సంఘం కార్యాలయంలో కమిషనర్ ప్రసాదరాజు జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. జాతిపిత మహాత్మాగాంధీ విగ్రహానికి మున్సిపల్ చైర్‌పర్సన్ ఏలూరి సుధారాణి పూలమాలలు వేసి నివాళులర్పించారు. మున్సిపల్ వైస్ చైర్మన్ పామర్తి మహేష్, జిల్లా వక్ఫ్‌బోర్డు వైస్ చైర్మన్ షేక్ క్వాజా, కౌన్సిలర్లు, అధికారులు పాల్గొన్నారు.

ఏలేశ్వరం: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ గొల్లపల్లి బుజ్జి ఆధ్వర్యంలో ఎంఈఓ అబ్బాయి జాతీయ పతాకాన్ని ఎగురవేశారు. ఏలేశ్వరం నగర పంచాయతీ కార్యాలయంలో చైర్‌పర్సన్ అలమండ సత్యవతి ఆధ్వర్యంలో కమిషనర్ కె.శ్రీనివాసరావు జాతీయజెండాను ఆవిష్కరించారు. వైఎస్సార్ సీపీ నాయకులు అలమండ చలమయ్య, శిడగం వెంకటేశ్వరరావు, బదిరెడ్డి గోవిందు, సుంకర రాంబాబు పాల్గొన్నారు.

ప్రత్తిపాడు: స్థానిక జ్యుడీషియల్ ఫస్ట్‌క్లాస్ మెజిస్ట్రేట్ కోర్టు ఆవరణలో న్యాయమూర్తి కాటం భాను జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయం వద్ద ఎంపీడీఓ ఎస్.వెంకటాచలం, తహసీల్దార్ కార్యాలయం వద్ద తహసీల్దార్ పీవీవీ గోపాలకృష్ణ, పోలీస్ స్టేషన్ వద్ద ఎస్సై కె.సుధాకర్ జాతీయ పతాకాలను ఆవిష్కరించారు. ఎంపీపీ గోళ్ల కాంతి సుధాకర్, జెడ్పీటీసీ సభ్యురాలు బెహరా రాజరాజేశ్వరి, గ్రామ సర్పంచ్ గుడాల విజయలక్ష్మి పాల్గొన్నారు.

శంఖవరం: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎమ్మెల్యే పర్వత పూర్ణచంద్రప్రసాద్, ఎంపీడీఓ జె.రాంబాబు జాతీయ జెండాను ఆవిష్కరించారు. అనంతరం డాక్టర్ బీఆర్ అంబేడ్కర్, గాంధీజీ చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఉత్తమ సేవలు అందించిన ప్రభుత్వ ఉద్యోగులకు ఎమ్మెల్యే సేవా పురస్కారాలు అందజేశారు. కార్యక్రమంలో ఎంపీపీ పర్వత రాజుబాబు, ఎంఈఓ ఎస్వీ రమణ పాల్గొన్నారు.



రత్నగిరిపై జాతీయజెండాకు వందనం చేస్తున్న ఈఓ సత్యనారాయణ మూర్తి, ఆలయ సిబ్బంది



గోకవరంలో జాతీయ జెండాను ఆవిష్కరిస్తున్న నాయకులు



ప్రత్తిపాడు కోర్టు ఆవరణలో జాతీయ పతాకాన్ని ఆవిష్కరిస్తున్న న్యాయమూర్తి కాటం భాను



తుని రెవెన్యూ కార్యాలయంలో గాంధీ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న అధికారులు

గండేపల్లి: స్థానిక మండల పరిషత్ కార్యాలయం వద్ద ఎంపీపీ చలగళ్ల దొరబాబు, ఎంపీడీఓ రామన్, ఏఓ రామాచార్యులు జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు.

కిర్లంపూడి: స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో బి.సతీష్‌బాబు, తహసీల్దార్ కార్యాలయంలో కేవీ మాధవరావు, పోలీస్‌స్టేషన్‌లో ఎస్సై టి.రఘునాథరావు జాతీయ జెండాను ఆవిష్కరించారు. ఎంపీపీ తోట రవి, కిర్లంపూడి సొసైటీ చైర్మన్ చదలవాడ బాబి, వైస్ ఎంపీపీ బొడ్డేటి గణపతి, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ దోమాల గంగాధర్ పాల్గొన్నారు.

జగ్గంపేట: స్థానిక మండల పరిషత్, వ్యవసాయ మార్కెట్ కమిటీ కార్యాయాల్లో ఎమ్మెల్యే జ్యోతుల చంటిబాబు జెండాను ఎగురవేశారు. ఎంపీపీ అత్తులూరి నాగబాబు, వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ జనపరెడ్డి బాబు, రాష్ట్ర వైఎస్సార్ సీపీ సేవాదళ్ కార్యదర్శి ఒమ్మి రఘురాం, ఎంపీడీఓ హరికృష్ణ పాల్గొన్నారు.

రౌతులపూడి: మండలంలోని ప్రభుత్వ కార్యాలయాలు, పాఠశాలలు వద్ద నిర్వహించిన గణతంత్ర వేడుకల్లో జెడ్పీటీసీ సభ్యుడు గొల్లు చినదివాణం, ఎంపీపీ జి.రాజ్యలక్ష్మి, వైస్ ఎంపీపీలు సాయి, లక్ష్మీభాస్కరబాబు, డీసీసీబీ డైరెక్టర్ పులి మధు, మండల కో ఆప్షన్ సభ్యుడు సీహెచ్‌వీవీ సత్యనారాయణ ముఖ్య అతిథులుగా పాల్గొని జాతీయ పతాకానికి గౌరవ వందనం చేశారు.

కోటనందూరు: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీఓ సుబ్రహ్మణ్యశర్మ, ఈఓపీఆర్డీ అరుణ్‌కుమార్, ఎంపీపీ లగుడు శ్రీనివాసుతో కలిసి జాతీయ జెండాను ఎగురవేసి గౌరవవందనం స్వీకరించారు. వ్యవసాయ సలహా మండలి రాష్ట్ర డైరెక్టర్ లంక ప్రసాద్ పాల్గొన్నారు.

తొండంగి: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీవో పసపులేటి సతీష్ జాతీయజెండాను ఆవిష్కరించారు. ఎంపీపీ అంగుళూరి అరుణ్‌కుమార్, ఈవోపీఆర్డీ ఎస్.సత్రప్రసాద్, మండల పరిషత్ సూపరింటెండెంట్ ఎంఎ ఆలీ, ఎంఈవో షేక్‌బాజ్జీ, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

తుని రూరల్: స్థానిక రెవెన్యూ కార్యాలయంలో తహసీల్దార్ బాలసుబ్రహ్మణ్యం, మండల పరిషత్ కార్యాలయంలో ఏఓ శేషగిరిరావు, రూరల్ పోలీస్ స్టేషన్‌లో ఎస్సై ఎ.బాలాజీ త్రివర్ణపతాకాన్ని ఆవిష్కరించారు. ఎంపీపీ డాక్టర్ బొప్పన రాము, జెడ్పీటీసీ సభ్యురాలు పోతల సూర్యమణి, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ పోతల రమణ పాల్గొన్నారు.

అన్నవరం: రత్నగిరి దేవస్థానంలోని రామారాయ కళావేదిక వద్ద దేవస్థానం ఈఓ సత్యనారాయణ మూర్తి జాతీయ పతాకాన్ని ఎగురవేశారు. అన్నవరం పంచాయతీ కార్యాలయం వద్ద సర్పంచ్ ఎస్ కుమార్ రాజా జాతీయపతాకాన్ని ఆవిష్కరించారు. వైస్‌సర్పంచ్ బొబ్బిలి వెంకన్నబాబు, ఎంపీటీసీ దడాల సతీష్ పాల్గొన్నారు.



తొండంగిలో జాతీయజెండాను ఆవిష్కరిస్తున్న ఎంపీడీఓ పసపులేటి సతీష్

గోకవరం: స్థానిక రెవెన్యూ కార్యాలయంలో తహసీల్దార్ శ్రీనివాస్, మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీఓ మూర్తి, పోలీస్ స్టేషన్‌లో ఎస్సై శివనాగబాబు జాతీయ జెండాలను ఎగురవేశారు. కార్యక్రమాల్లో ఎంపీపీ సుంకర శ్రీవల్లి , జెడ్పీటీసీ దాసరి శ్రీరంగ తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగులకు ఉత్తమ సేవా పురస్కారాలు



కాకినాడలో కలెక్టర్ కృతికా శుక్లా, జేసీ ఇలక్కియ, ఎస్పీ రవీంద్రనాథ్‌బాబు నుంచి అవార్డులు అందుకుంటున్న అధికారులు

ఏలేశ్వరం/తుని/తుని రూరల్/గండేపల్లి/రౌతులపూడి/ప్రత్తిపాడు/తొండంగి/కిర్లంపూడి: విధి నిర్వహణలో ఉత్తమ సేవలు అందించిన ఉద్యోగులకు ఉత్తమ సేవా పురస్కారాలు దక్కాయి. తుని, పత్తిపాడు, జగ్గంపేట నియోజకవర్గాల్లోని పలువురు అధికారులు అవార్డులు వచ్చాయి. జిల్లా కేంద్రం కాకినాడలో జరిగిన రిపబ్లిక్ డే వేడుకల్లో కలెక్టర్ కృతికా శుక్లా, జేసీ ఇలక్కియ, ఎస్పీ ఎం.రవీంద్రనాథ్‌బాబు, వ్యవసాయ శాఖ కమిషనర్ హరికిరణ్ నుంచి వీరు ఉత్తమ సేవా అవార్డులు అందుకున్నారు. అవార్డులు అందుకున్న వారిలో ఏలేశ్వరం మండల రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ పొన్నాలు, ఈఓపీఆర్డీ కేవీ సూర్యనారాయణ, తుని తహసీల్దార్ బాల సుబ్రహ్మణ్యం, తుని అర్బన్ ఐసీడీఎస్ సీడీపీవో నాగలక్ష్మి, గండేపల్లి పీహెచ్‌సీ వైద్యాధికారి ఐ.సౌమ్య, కిర్లంపూడి మండలం ముక్కొల్లు వీఏఏ రాజాల అబ్బాయి, రౌతులపూడి మండలం ఎస్.అగ్రహారం సచివాలయ హార్టీకల్చర్ అసిస్టెంట్ లాలం ప్రసాద్, రౌతులపూడి సీహెచ్‌సీలో శానిటరీ సూపర్‌వైజర్ ఎ.అర్జున్, గంగవరం సచివాలయం ఇంజినీరింగ్ అసిస్టెంట్ కె.దుర్గాప్రసాద్, తొండంగి ఎంపీడీఓ పసపులేటి సతీష్, దానవాయిపేట పంచాయతీ కార్యదర్శి కె.రాజబాబు, ప్రత్తిపాడు ప్రభుత్వ ఎస్సీ బాలుర వసతిగృహం సంక్షేమాధికారి ఎంఎస్ సత్యనారాయణ ఉన్నారు.

యువత దేశభక్తిని అలవర్చుకోవాలి

తుని: యువత దేశభక్తిని అలవర్చుకోవాలని రాష్ట్రీయ స్వయం సేవక్ ప్రాంతీయ ప్రచారక్ విజయ ఆదిత్య సూచించారు. స్థానిక శ్రీచైతన్య కళాశాల మైదానంలో రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ ఆధ్వర్యంలో గురువారం హిందూ సంగమం కార్యక్రమం జరిగింది. అంతకు ముందు పట్టణంలోని మార్కెట్ యార్డు, ఆంజనేయస్వామి గుడి, రాజా ఉన్నత పాఠశాల, మెయిన్ రోడ్డు, గొల్ల అప్పారావు సెంటర్, రామా థియేటర్ సెంటర్ మీదుగా పద సంచలనం (రూట్ మార్చ్) నిర్వహించారు. సభా వేదిక ప్రాంగణంలో డాక్టర్ గురూజీ, భరతమాత చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆర్‌ఎస్‌ఎస్ కరసేవకుల డ్రిల్ అందరినీ అలరించింది. జిల్లా సహకార్యవాహి జొన్నలగడ్డ బాల ఆదిత్య, కుచ్చర్లపాటి బీమరాజు, దాడిశెట్టి విష్ణుచక్రం, ప్రసాద్, గోపీకృష్ణ, చదరం నర సింగరావు, కుందెం సత్యనారాయణ, కుమార్ పాల్గొన్నారు.

మెడలో తాడు ఇవ్వలేదని..

ప్రత్తిపాడు: భార్య మెడలో బంగారు తాడు ఇవ్వలేదన్న అక్కసుతో భార్యతో పాటు చెల్లెలు, ఆమె భర్తను చితకబాదిన ఘటన ప్రత్తిపాడు మండలం లంపకలోవలో బుధవారం రాత్రి జరిగింది. స్థానిక పోలీసుల కథనం ప్రకారం.. లంపకలోవ గ్రామానికి చెందిన దాట్ల రాజుకు డబ్బులు అవసరం వచ్చి తన భార్య పద్మను అడిగాడు. ఆమె లేవని చెప్పడంతో మెడలో ఉన్న తాడు ఇవ్వాలంటూ ఒత్తిడి తెచ్చాడు. దీంతో ఆమె ఎదురు తిరగడంతో ఆక్రోసంతో కర్రతో భార్యను కొడుతుండగా అడ్డుకోబోయిన అతని చెల్లెలు జల్లూరి కుమారి, ఆమె భర్త రాంబాబులపై కూడా దాడి చేశాడు. చెల్లెలు కుమారి గురువారం పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ప్రత్తిపాడు ఎస్సై కె.సుధాకర్ తెలిపారు.

స్టడీ మెటీరియల్ పంపిణీ

తొండంగి: విద్యార్థులకు ప్రభుత్వం అందిస్తున్న సౌకర్యాలను సద్వినియోగం చేసుకోవాలని జెడ్పీ వైస్ చైర్మన్ మేరుగు పద్మలత సూచించారు. మండలంలోని బెండపూడి, అద్దరిపేట, దానవాయిపేట జెడ్పీ హైస్కూళ్లలో పదో తరగతి విద్యార్థులకు గురువారం ఆమె విద్యాభారతి పుస్తకాలను స్టడీ మెటీరియల్‌ను పంపిణీ చేశారు. సర్పంచులు కోడా వర్మ, మడదా తిరుమల కుమారి, ఏలేటి దుర్గాదేవి, ఎంపీటీసీ కటారి లక్ష్మణ్, మళ్ల తేజ, గొంతెన దుర్గ పాల్గొన్నారు.

'ఇంటింటికీ జెడ్పీటీసీ' ప్రారంభం

జగ్గంపేట: గ్రామంలో జెడ్పీటీసీ సభ్యురాలు ఒమ్మి బిందుమాధవి, రాష్ట్ర వైఎస్సార్ సీపీ సేవాదళ్ కార్యదర్శి ఒమ్మి రఘురాం దంపతులు గురువారం ఇంటింటికీ జెడ్పీటీసీ కార్యక్రమాన్ని ప్రారంభించారు. గ్రామంలోని ప్రతిఇంటికీ వెళ్లి ప్రజల సమస్యలు తెలుసుకున్నారు. ప్రజా సమస్యల పరిష్కారానికే ఇంటింటికీ జెడ్పీటీసీ కార్యక్రమం ప్రారంభించినట్టు తెలిపారు ఎంపీటీసీ సభ్యులు ఆకుల శ్రీధర్, చెరుకూరి జయరాజ్ తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా వసంత పంచమి పూజలు

- సరస్వతీదేవికి ప్రత్యేక పూజలు
- గ్రామాల్లో సామూహిక అక్షరాభ్యాసాలు

తుని/గండేపల్లి/జగ్గంపేట/ప్రత్తిపాడు/ప్రత్తిపాడు రూరల్: ఏలేశ్వరం/ కిర్లంపూడి: వసంత పంచమిని పురస్కరించుకుని తుని, ప్రత్తిపాడు, జగ్గంపేట నియోజకవర్గాల్లోని పలు పాఠశాలలు, ఆలయాల్లో సామూహిక అక్షరాభ్యాసాలు నిర్వహించారు. తుని కోర్టు వీధిలోని శ్రీసరస్వతీ శిశు మందిర్‌లో జేసీఐ క్లబ్ సహకారంతో 120 మంది చిన్నారులకు సామూహిక అక్షరభ్యాసం నిర్వహించారు. చిన్నారులకు అవసరమైన పలక, బలం, పూజా సామగ్రిని జేసీఐ క్లబ్ తరఫున ఉచితంగా అందజేశారు. సూరంపాలెం ఆదిత్య విద్యాసంస్థల క్యాంపస్‌లోని సరస్వతీ దేవి నిలయం వద్ద పండితులు సరస్వతీదేవికి విశేష పూజలు, అభిషేకాలు నిర్వహించారు. ఆదిత్య విద్యాసంస్థల చైర్మన్ ఎన్.శేషారెడ్డి, లక్ష్మీరాజ్యం దంపతుల ఆధ్వర్యంలో చిన్నారులకు పలకలు, పుస్తకాలు అందజేశారు. ప్రిన్సిపాల్స్ ఎం.శ్రీనివాసరెడ్డి, మేడపాటి భాస్కర చంద్రారెడ్డి పాల్గొన్నారు. జగ్గంపేట మండలం మర్రిపాక విఘ్నేశ్వరస్వామి ఆలయంలో వేంచేసిన సరస్వతీదేవి అమ్మవారి సన్నిధిలో సామూహిక అక్షరాభ్యాసాలు నిర్వహించారు. ప్రత్తిపాడు మినర్వా విద్యా సంస్థల ఆవరణలో సామూహిక అక్షరాభ్యాసం నిర్వహించారు. విద్యార్థులు చదువుల తల్లి సరస్వతీదేవికి పూజలు చేశారు. కిర్లంపూడి విజ్ఞానభారతి ఇంగ్లిషు మీడియం హైస్కూల్‌లో గురువారం వసంతి పంచమి వేడుకలు నిర్వహించారు. పాఠశాల హెచ్ఎం గాడి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో 72 మంది విద్యార్థులకు సామూహిక అక్షరాభ్యాసాలు నిర్వహించారు. ప్రత్తిపాడు మండలం ఒమ్మంగి శ్రీభారతీ విద్యానికేతన్‌లో 520 మంది విద్యార్థులకు సామూహిక అక్షరాభ్యాసాలు నిర్వహించారు. పాఠశాల ఆవరణలో లక్ష్మీ గణపతి హోమం, సరస్వతీదేవికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఏలేశ్వరంలో విశ్వహిందూ పరిషత్ మండల శాఖ అధ్యక్షకార్యదర్శులు అలమండ దుర్గా వెంకటప్రసాద్, కటకం కిరీటి ఆధ్వర్యంలో సుమారు 50 మంది విద్యార్థులకు సామూహిక అక్షరాభ్యాసాలు నిర్వహించారు.



ఒమ్మంగి శ్రీభారతి విద్యానికేతన్‌లో సామూహిక అక్షరాభ్యాసాలు



కిర్లంపూడి విజ్ఞాన భారతి పాఠశాలలో సామూహిక అక్షరాభ్యాసాలు



సూరంపాలెం ఆదిత్య కళాశాలలో సామూహిక అక్షరాభ్యాసాలు

శివలింగం ప్రతిష్ఠ ఉత్సవాలకు అంకురార్పణ

తుని రూరల్: మండలంలోని చేపూరులో నిర్మించిన పరివార ప్రయుక్త ఉమారామ లింగేశ్వరస్వామి వార్ల (శివలింగం) ప్రతిష్ఠోత్సవాలకు బ్రహ్మశ్రీ కాళ్లకూరి దుర్గాప్రసాద్‌శర్మ గురువారం అంకురార్పణ చేశారు. మూడు రోజుల పాటు జరిగే వివిధ పూజా కార్యక్రమాలను గణపతి పూజతో ప్రారంభించారు. యాగశాల ప్రవేశం, పుణ్యాహవచనం, దీక్షాధారణ, అఖండ జ్యోతి ప్రజ్వలన, అగ్ని ప్రతిష్ఠ, మూలమంత్ర హోమం, మంగళహారతి, ప్రసాద వితరణ కార్యక్రమాలు నిర్వహించారు.

ఉచిత వైద్య శిబిరం

జగ్గంపేట: స్థానిక పెన్షనర్స్ భవనంలో గురువారం వాకర్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఉచిత మెడికల్ క్యాంపు, ఆరోగ్య అవగాహన సదస్సు నిర్వహించారు. ఆదిత్య హాస్పటల్ వైద్యులు ఎం.ఎస్ బాలగంగాధర్ సుమారు 50 మందికి వైద్య పరీక్షలు చేశారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

తుని: స్థానిక విద్యుత్ సబ్‌స్టేషన్, లైన్ల నిర్వహణలో భాగంగా శుక్రవారం పట్టణంలోని పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ట్రాన్స్‌కో ఈఈ కె.రత్నాలరావు గురువారం తెలిపారు. పట్టణంలోని 1 నుంచి 10 వార్డులు, కొండవారిపేట, టైలర్స్‌కాలనీ, అమ్మాజీపేట, సీతారాంపురం, కంకిపాటివారి గరువు, శ్రీనివాసా సెంటర్, ఆర్టీసీ కాంప్లెక్స్, రెల్లికాలనీ, డ్రైవర్స్ కాలనీ తదితర ప్రాంతాల్లో ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకూ విద్యుత్ సరఫరా ఉండదన్నారు. ప్రజలు ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేసుకొని సహకరించాలని కోరారు.

రామవరంలో..

జగ్గంపేట: స్థానిక విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలోని రామవరం గ్రామంతో పాటు ఇండస్ట్రియల్ పరిధిలో శుక్రవారం ఉదయం 7 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకూ విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని స్థానిక ట్రాన్స్‌కో డీఈ కె.రత్నాలరావు తెలిపారు.

వానరాల పట్టివేత

తుని: ప్రజలకు కంటి మీద కునుకు లేకుండా చేస్తున్న వానరాలను పట్టుకుని అటవీ ప్రాంతంలో వదిలినట్టు మున్సిపల్ కమిషనర్ ప్రసాదరాజు గురువారం తెలిపారు. ప్రజల నుంచి వచ్చిన ఫిర్యాదుల మేరకు పట్టణంలోని పలు ప్రాంతాల్లో బోన్లు ఏర్పాటు చేశారు. కోతులను పట్టడంలో అనుభవం ఉన్న వ్యక్తులను తీసుకు వచ్చి, వారితో సుమారు 100 వానరాలను పట్టుకున్నారు. ప్రత్యేకంగా తయారు చేసిన బోనులో వీటిని ఉంచి అల్లూరి సీతారామరాజు జిల్లా డౌనూరు సమీపంలోని అటవీ ప్రాంతంలో విడిచి పెట్టినట్టు శానిటరీ ఇన్‌స్పెక్టర్ శేఖర్, సిబ్బంది పాల్గొన్నారు.